

# భారతీయ సినిమాల్లో స్త్రీమూర్తులు

## వారాల ఆనంద్



ఈ రోజుల్లో ఐతే చాలా సినిమాల్లో స్త్రీ పాత్రలు కేవలం ఆటబొమ్మలుగా ఉంటున్నాయి కానీ దశాబ్దాలుగా వచ్చిన ఇండియన్ సినిమాని పరిశీలిస్తే స్త్రీ పాత్రలకి పెద్దపీట వేసిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అన్ని భారతీయ భాషలనుంచీ స్త్రీ పాత్రలని ప్రధానంగా చిత్రీకరించిన ఉత్తమ సినిమాల పరిచయాలు .. నెలకి రెండు సినిమాల చొప్పున.

కళాత్మక చిత్రాభిమాని ఆనంద్ గారు కవి, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత, దర్శకులు కూడ. ఒక కవితా సంపుటిని, సినిమాల మీద నాలుగు పుస్తకాలని రచించారు. కళాత్మక చిత్రోత్సవాల నిర్వహణలో విశేషానుభవం ఉంది. **varalaanand@hotmail.com**

### సుజాత

**భాష:** హిందీ, **కథ:** సుబోధ్ ఘోష్, **సంగీతం:** ఎస్డీ బర్మన్; **దర్శకత్వం:** బిమల్ రాయ్

**నటినటులు:** నూతన్(సుజాత), సునీల్ దత్ (అధిర్) **విడుదల:** 1959

స్త్రీ పాత్రలకి ప్రముఖ స్థానమూ, సామాజిక అన్వయమూ కల్పించడం బిమల్ రాయ్ నిర్మించిన చిత్రాల్లోని మౌలిక లక్షణం. అందుకే ఆయనని మహిళా చిత్రాల దర్శకుడిగా అభినందిస్తారు. ఆయన సినిమాల్లో ఆకలి, శ్రమ, నిజాయితీ, అంటరానితనమూ, నిరుద్యోగమూ వంటి అనేక సామాజిక అంశాలు ప్రధాన ఇతివృత్తాలయ్యాయి. ఆయన చిత్రాలు సుజాత, నౌకరీ, పరక్, పరిణిత, లాంటివి విశేష మన్ననలు పొందాయి. ఆయన నిర్మించిన 'దోభీగా జమీన్' లాంటి ఆఫ్‌బీట్ చిత్రాలు దేశ విదేశాల్లో విమర్శకుల మన్ననల్ని అందుకున్నాయి. బిమల్ రాయ్ చిత్రాల్లో మంచి సంగీతమూ, నృత్యాలూ, సున్నితమైన నాటకీయతా మనకు స్పష్టంగా కనిపిస్తాయి. ముఖ్యంగా ఆయన కథను నడిపించే తీరు, పాత్రల రూపకల్పన హృద్యంగా ఉండి సజీవంగా కనిపిస్తాయి.




బిమల్ రాయ్ 1959లో నిర్మించిన 'సుజాత' చిత్రాన్ని ఆ కాలపు ప్రగతి శీలమయిన చిత్రంగానే పరిగణించవచ్చు. అంటరానితనాన్ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని నిర్మించిన ఈ చిత్రంలో స్త్రీ సమస్యకు తోడు అంటరాని తనమూ తోడయినపుడు ఆ స్త్రీ పడే ఆవేదనా, అనుభవించే దుఃఖమూ హృద్యంగా ఆవిష్కరించబడింది. సుజాత పాత్రలో నూతన్ గొప్పగా సరిపోయింది. ఇంకా 'సునో మెరీ బంధూరే,' 'జల్తెహై జిస్కేలియే' లాంటి పాటలు సుజాత చిత్రానికి వన్నె తెచ్చాయి. ఈ

చిత్రంలో మనుషుల కులాల కతీతంగా వారి రక్తం ఎక్కడయినా ఎరుపే అని సూచిస్తాడు. సుజాత తర్వాతే అనేక భారతీయ సినిమాల్లో ఈ రక్తసంబంధాల్ని ఇతివృత్తాలుగా స్వీకరించారు. అప్పటికి అది ఒక గొప్ప ప్రతీక. ఇక సుజాత చిత్ర కథాంశం విషయానికి వస్తే ఓ రైల్వే కూలీ చిన్నారి కూతురు అనాథగా మిగులుతుంది. తీవ్రమయిన కలరా వ్యాధి సోకి తన వాళ్ళందరూ చనిపోగా ఆ అమ్మాయి మిగులుతుంది. రైల్వేలో పని చేసే ఇంజనీరు ఉపేంద్రనాథ్ చౌదరీ, ఆయన భార్య చారు ఆ చిన్నారి సుజాతను చేరదీస్తారు. ఓ ప్రక్క సుజాత అంటరాని కులానికి చెందినదేనన్న భావం తొలుస్తున్నప్పటికీ ఆ అమ్మాయికి ఏ లోటూ రానీయకుండానే పెంచుతారు. తమ కూతురు రమకు తోడుగా సుజాతను చూసినప్పటికీ ఆమె కులం వారికి పెద్ద అడ్డుగానే మిగిలిపోతుంది. సుజాతకు నీడనిచ్చి పెంచడాన్ని అందరూ హర్షించరు. తమలాంటి బ్రాహ్మణ కుటుంబంలో సుజాతకు స్థానం కల్పించడం సరైంది కాదని కూడా ఉపేంద్రనాథ్‌కి చెబుతారు. ముఖ్యంగా



ధనవంతురాలయిన వారి కుటుంబ మిత్రులు ఇరిబాల సుజాతను ఎంత తొందరగా వీలయితే అంత తొందరగా ఇంటినుంచి పంపించివేయకుంటే తీవ్రమయిన పరిణామాల్ని ఎదుర్కోవలసి వస్తుందని కూడా హెచ్చరిస్తుంది. కాని ఆ భార్యాభర్తలు వినరు. సుజాత క్రమంగా పెరిగి పెద్దదై రమకి మంచి స్నేహితురాలిగా మారుతుంది. కాని ఎంత మామూలుగా ఉన్నప్పటికీ రమని తమ కూతురని, సుజాత తమ కూతురు లాంటిదని అన్నప్పుడల్లా సుజాత తన గతాన్ని తలుచుకుని బాధపడుతుంది. చౌదరీ కుటుంబం గిరిబాలతో నివసించడానికి ఉపక్రమించి నప్పుడు పరిస్థితి మరింత విషమిస్తుంది. గిరిబాల మనుమడు అధిర్‌కు రమకు పెళ్ళి చేయాలని గిరిబాల ఉపేంద్రనాథ్‌లు ఇద్దరూ భావిస్తారు. కాని అధిర్ మాత్రం సుజాత వైపే మొగ్గు చూపిస్తాడు. సుజాత అందం, నడవడి, మర్యాదలను అధిర్ ఇష్టపడతాడు. అది తెలిసి రెండు కుటుంబాలు గందరగోళంలో పడిపోతాయి. ఇంట్లో వాళ్ళంతా థియేటర్‌కి వెళ్ళినప్పుడు ఒంటరిగా మిగిలిన అధిర్ సుజాతల జంట తమ అభీష్టాల్ని తెలియజేసుకుంటారు. అధిర్ విషయాన్ని నానమ్మ గిరిబాలకు చెప్పగా ఆమె కోపోద్రిక్తురాలవుతుంది. చారు సుజాతకు ఆమె స్థానాన్ని చూపిస్తుంది. అంతేకాదు ఆమెకు ఆమె కులానికి చెందిన యువకుడ్ని వెదికి పెళ్ళి చేసేందుకు కూడా ప్రయత్నిస్తుంది. కాని అవేవి ఫలించవు. చారు మెట్లమీద నుంచి కిందపడి తీవ్రంగా గాయపడుతుంది. తీవ్రంగా రక్తస్రావం అవుతుంది. చారును రక్షించడానికి రక్తం అవసరమవుతుంది. అందరి రక్తం పరీక్షిస్తారు. అయితే అందరిలోకి చారుకి సుజాత రక్తమే సరిపోతుంది. అంటరానిదిగా భావించే సుజాత రక్తమే చారును కాపాడుతుంది. మన సమాజంలో అంటరానితనమన్నది సామాజిక దురాచారమే తప్ప వాస్తవానికి మనుషుల మధ్య తేడాలేమీ ఉండవని చిత్రం ప్రభోదిస్తుంది. సుజాత సామాజిక దురాచారాన్ని ఇతివృత్తంగా తీసుకున్నప్పటికీ చిత్రీకరణ కథా కథనం కళాత్మకంగానూ, లిరికల్ గానూ సాగి హాయిని గొలుపుతుంది. బిమల్ రాయ్ చిత్రీకరణకు తోడు నూతన్ నటన సుజాతకు ఎంతో వన్నె తెచ్చింది. బిమల్ రాయ్ 'సుజాత' నాటినుంచి నేటిదాకా మరిచిపోలేని మరుపురాని పాత్రే.

✡✡✡

## సాహెబ్ బీబీ ఔర్ గులామ్




భాష: హిందీ, దర్శకత్వం: అబ్రార్ అల్వీ; కథ : బిమల్ మిత్ర; సంగీతం-హేమంత్ కుమార్;
నటినటులు: గురుదత్, మీనా కుమారి, రెహమాన్, నాజర్ హుస్సేన్
విడుదల:1962

సహచర్యం, ఎడబాటు, ప్రేమ, విరహం, భావుకత గాంభీర్యం కలగలిసిన మనుషులూ మానవ సంబంధాలూ గురుదత్ చిత్ర లక్షణాలు నటుడు నిర్మాత దర్శకుడుగా 21 ఏళ్ళపాటు చిత్రసీమలో వెలుగొందిన గురుదత్ హృదయావిష్కరణ చేయడంలోనూ, తన ఆలోచనలనీ అనుభూతులనీ దృశ్యమానం చేయడంలోనూ తనకు తానే సాటి. హిందీ చిత్రసీమ స్థాయిలో గమనిస్తే గురుదత్ ఎనలేని భావుకత కలిగిన అద్భుత చలన చిత్రకారుడు. ముఖ్యంగా ఆయన ప్యాసా, కాగజ్‌కే ఫూల్, సాహిబ్ బీబీ ఔర్ గులామ్ తదితర చిత్రాలు భారతీయ చలన చిత్రసీమలో సుస్థిరమైన స్థానాన్ని సంపాదించాయి.

కాగజ్‌కే ఫూల్ తర్వాత తన చిత్రాలకి దర్శకుడిగా తన పేరు కాకుండా మరొకరిది పెట్టడం ఆనవాయితీగా చేసుకున్న గురుదత్ దార్శనికత ఆయన నిర్మించిన అన్ని చిత్రాల్లో సుస్పష్టంగా కనిపిస్తుంది. తన రచయితతోనూ, టెక్నీషియన్లతోనూ సంపూర్ణమయిన సమన్వయంతో పనిచేసే గురుదత్ ప్రేమాస్పదమైన చిత్రాలకి రూపకల్పన చేశారు. అలాంటి చిత్రాల్లో ఒకటి 'సాహిబ్ బీబీ ఔర్ గులామ్'. 19వ శతాబ్దం నాటి ఓ జమిందారి కుటుంబంలో చోటీ బహూ అనుభవాల్ని, ఆమె ఎదురు తిరిగి, తనని తాను అర్పించుకున్న సందర్భాన్ని ఇందులో అద్భుతంగా చిత్రించారు.




ఆనాటి జమిందారీ కుటుంబమంటే పెద్ద పెద్ద గదులున్న కోటల్లాంటి ఇళ్ళు, నిరంతరం విరామంగా ఉండే అందమైన స్త్రీలు వారి అలంకరణలూ, ఎప్పుడూ మత్తులో ఓలలాడుతూ మందులోనూ, పొందులోనూ మునిగి తేలుతూ ఉండే పురుషులూ వారి అధికార దర్పమూ, వారి భవంతుల కావల ఆకలి శ్రమ వేదనల తోడుగా నివసించే కష్టజీవులైన రైతులూ ఈ వాస్తవ దృశ్యాల్ని ఇముడ్చుకున్న బెంగాలీ కథను పూర్తిస్థాయిలో చలనచిత్రంగా మలిచాడు గురుదత్.

బెంగాల్లో 19వ శతాబ్దంలో చౌదరీలది గొప్ప పేరున్న కుటుంబం, మజిల్ బాబు, చోటే బాబుల ఆధిపత్యంలో సాగే ఆ కుటుంబం ఓ పెద్ద హవేలీలో నివాసముంటుంది. ఇద్దరు సోదరులూ తమకు వంశపారంపర్యంగా సంక్రమించిన ఆస్తిపాస్తుల్ని అనుభవిస్తూ ఉండడంతో పాటు మందులో తేలియాడుతూ క్రీడలు, వేశ్యాస్త్రీల సంపర్కమూ తదితరమైన విలాసవంతమైన అలవాట్లతో కాలం గడిపేస్తూ ఉంటారు. ఇదంతా అలాంటి గృహాల్లో సర్వసాధారణం. అక్కడ ఏదీ అతికాదు. ఏదైనా అంగీకారమే ఏళ్ళుగా తరాలుగా వస్తున్న వారి కుటుంబ సామాజిక స్థితిపట్ల ఎవరికీ భిన్నాభిప్రాయం ఉండదు. ముఖ్యంగా ఆ ఇంట్లో నివసించే స్త్రీలు తమ పురుషుల అలవాట్ల పట్ల ప్రవర్తనల పట్ల ఉదాసీనగా ఉండడం అలవాటు చేసుకుంటారు. కాని చోటే బాబు భార్య చోటీ బహూ మాత్రం హవేలీలోని వాతావరణాన్ని భరించలేక పోతుంది. సున్నితమైన ఆమె మనస్సు విలవిలలాడిపోతుంది. కేవలం మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన ఆమె తన భర్త తనను అలక్ష్యం చేస్తున్నాడనే విషయాన్ని జీర్ణించుకోలేక పోతుంది. తీవ్రమయిన ఒంటరితనాన్ని నిరాదరణను అనుభవిస్తున్న ఆమె సొంత ప్రపంచంలోకి ఓ కొత్త వ్యక్తి రాక సంచలనం కలిగిస్తుంది. ఆ హవేలీలో పనిచేసే తన బంధువు వద్ద ఉండటానికి వచ్చిన భూత్‌నాథ్ ఆమెలో చలనం కలిగిస్తాడు. దయాళువు, ప్రేమాస్పదుడూ అయిన భూత్ నాథ్ చోటీ బహూను విపరీతంగా ఆకర్షిస్తాడు. మోహిని సింధూర్ కంపెనీలో ఉద్యోగం సంపాదిస్తాడు. కంపెనీ యజమాని కూతురు జాబాతో భూత్‌నాథ్ కి సాన్నిహిత్యం ఏర్పడుతుంది. కంపెనీ నుంచి సింధూర్ తెచ్చి ఇస్తూ ఉండడంతో భూత్‌నాథ్ కి చోటీ బహూతో పరిచయం పెరుగుతుంది. తన భర్తను తనవైపునకు ఆకర్షించేందుకు చోటీ బహూ చేసిన ప్రయత్నాలన్నీ విఫలమవుతాయి. కానీ ఒక రోజు చోటే బాబు చోటీ బహూల మధ్య మాటామాటా పెరుగుతుంది. ఆ వాదనలో చోటీ బహూని తాగిచూడమని ఛాలెంజ్ చేస్తాడు బాబు. ఆ సంఘటన ఆమెలో పట్టుదలను

పెంచుతుంది. క్రమంగా తానూ తాగడం అలవాటు చేసుకుంటుంది. ఆ అలవాటు కాస్తా వ్యసనంగా మారే స్థితికి చేరుతుంది. భూత్‌నాథ్ ఆమెను అనేక విధాలుగా ఓదార్చేందుకు మామూలు మనిషి చేసేందుకు ప్రయత్నిస్తాడు కానీ అవేవీ ఆమెను మార్చలేకపోతాయి. కానీ బూత్‌నాధ్ చోటీ బహూల సాన్నిహిత్యంపై హవేలీలోని వారికి అనుమానం కలుగుతుది. వారు చోటీ బహూపై అనుమానం పెంచుకుని కుటుంబ గౌరవం అంటూ తలచి ఆమెను చంపేసి, భూస్థాపితం చేస్తారు.

చిత్రం మొత్తం ఫ్లాష్ బ్యాక్‌లో సాగే ఈ సినిమాలో చోటీ బహూ పాత్రను పోషించిన మీనా కుమారి నటన అత్యంత ఉన్నతంగా సాగుతుంది. ఆనాటి హిందీ చలన చిత్రసీమ విలువల మేరకు, లేదా ఆనాటికి ఉన్న చిత్రీకరణ స్థాయి మేరకు ఆలోచిస్తే 'సాహెబ్ బీబీ ఔర్ గులామ్'లో ఓ స్త్రీ పాత్ర, అందునా హవేలీ గోడల్లో ఉండే స్త్రీ పాత్రను తాగుబోతుగా చిత్రించడం అసాధారణమూ, ఆధునికమూ అనే చెప్పుకోవచ్చు.

ఈ చిత్రంలో కూడా గురుదత్ తన ఇతర సినిమాల్లోలాగే రెండు భిన్న స్థాయిల్ని ప్రాజెక్టు చేస్తాడు. ప్రధాన ఇతివృత్త స్రవంతి హవేలీ లోనూ చోటీ బహూ అంతరంగంలోనూ నడుస్తూ ఉంటే మరో వైపు భూత్ నాథ్ ఫ్యాక్టరీ జీవితం హాస్యం, జాబాతో ప్రేమ వ్యవహారం అంతా అక్కడ కొనసాగుతూ ఉంటుంది. అంటే హిందీ చిత్రసీమ ఆనవాయితీ మేరకు ప్రేమ, హాస్యం, రోమాన్స్, పాటలు అన్నీ భూత్ నాథ్ జీవితంలో కనిపిస్తే, సీరియస్ విషయాల్ని ప్రధాన ఇతివృత్త అంశాల్ని మరో కోణంలో చిత్రించాడు గురుదత్.

హవేలీ వాతావరణానికి ఎదురుతిరిగిన చోటీబహూ తనని తాను సమిధలా చేసుకుని తనువు చాలించుకుంది. చిత్రీకరణలో కాని, కథను నడిపించడంలో కాని గురుదత్ ప్రతిభ సుస్పష్టంగా కనిపిస్తుంది. భూత్ నాథ్ హాస్యం కొంత ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ చోటీ బహూ మానసిక, కుటుంబ సంఘర్షణాత్మక చిత్రంగా 'సాహెబ్ బీబీ ఔర్ గులామ్' చాలా గొప్ప చిత్రం, గురుదత్ సృష్టించిన ఆణిముత్యాల్లో ఇదొకటి.

✡✡✡